REGD No. H 18

విడిప్రతి 0–25 పై.

23–9–66 శుక్రవారం

# జమీన్ రైతు

స్థాపకులు : నెల్లూరు వెంకట్రామానాయుడు

సంపుటి 38 ]　　సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి　　[ సంచిక 38



వి. ఆర్. కాలేజి విద్యార్థిసంఘ ప్రారంభోత్సవ చిత్రం: ఎడమనుండి కుడికి: ప్రారంభకులు, మద్రాసు క్రిష్టియన్ కాలేజి అధ్యాపకులు శ్రీ మిత్రా జె. అగస్టిన్; అధ్యక్షులు ఆచార్య మామిడిపూడి వెంకట రంగయ్య; ప్రిన్సిపాల్ శ్రీ ఆర్. సుబ్బారెడ్డి; విద్యార్థిసంఘ అధ్యక్షుడు శ్రీ వి. సదాశివరెడ్డి.

# రాజీయా? పోటీయా? అయోమయమైన అనిశ్చిత స్థితి!

రాష్ట్రకాంగ్రెస్ రాజకీయాలలో అయోమయమైన అనిశ్చితస్థితి, ప్రతిష్ఠంభన ఏర్పడింది.

ఎలక్షన్ కమిటీ 11వ సభ్యుని ఎన్నిక ఇక ఐదురోజులుమాత్రమేవుంది. అయినా ఈనాడుకూడా పోటీ జరిగితీరుతుందని కాని, రాజీ అసంభవమనికాని చెప్పగలిగేవారెవరూ వున్నట్లులేదు. అందరూ ముఖాలెత్తి ఎర్నాకులంవైపు, కామరాజ్ వైపు చూస్తున్నారు.



మద్రాసునుండి మాకు తెలిసినదానికి, దినపత్రికలలో వచ్చినదానికి కథనాలు భిన్నంగావున్నాయి. హైదరాబాదులోని రాజకీయవాదులు మొత్తానికి అయోమయంలోనే వున్నట్లున్నారు; వారికి ఏసంగతీ తెలిసినట్లులేదు; ముఖ్యమంత్రికికాని, వారి వర్గంలోని ముఖ్యులకుకాని తాజావరిణామాలేమీ తెలిసినట్లు కనుపించదని మా విలేఖరి శుక్రవారం వుదయం చెప్పారు. పోటీ–రాజీ మధ్య రాజధాని రాజకీయ వర్గాలు డోలాందోళితంగా వున్నాయి. కాని సభ్యుల సమీకరణ, బాధ్యతల విభజన, క్యాంపుల ఏర్పాటు ఈ కార్యక్రమం మాత్రం యధావిధిగా సాగిపోతున్నది. పి. ఐ. సి. సి. కి ముఖ్యమంత్రి తప్ప, ఆ వర్గంలో ఇంకెవ్వరూ పోయినట్లులేదు.

సంజీవరెడ్డి–సంజీవయ్య–పి. సి. సుబ్బారెడ్డి–రఘురామయ్య ఇత్యాదులంతా మద్రాసుచేరుకున్నారు వివిధజిల్లాలనుండి వారి అనుయాయులనుకునేవాళ్లు కూడా చాలామందివచ్చారు. మాకు చెందిన లక్ష్మణదాసుకూడా మద్రాసులోనేవున్నాడు నెల్లూరునుండికూడా ఒకసభ్యుడు అచ్చట

—కొరవ 6 వ పేజీలో

# నెల్లూరులో అధికధరలు– అంగళ్లమీద దాడి– 14 మంది అరెస్టు– నిరసనగా అంగళ్లమూత!

నెల్లూరులోకూడా అధికధరలమీద దాడి ప్రారంభమైంది. 20 తేది సి.ఐ.డి. శాఖకు చెందిన డి. ఎస్. పి. లు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ఇన్‌స్పెక్టర్లు కొన్ని అంగళ్ళమీద దాడిజరిపి, వస్తువులను అమ్మవలసిన ధరకంటే ఎక్కువధరకు అమ్ముతుండిన 14 మంది వర్తకులను పట్టుకున్నారు. అరెస్టయిన 14 మంది 22 తేది జామీనుమీద విడుదలచేయబడినారు. వర్తకులను అరెస్టుచేసినందుకు నిరసనగా 21, 22 తేదులలో టవున్‌లో దాదాపు అన్ని అంగళ్లు మూసివేయబడినవి.

దాడి వివరాలివి: (1) చిట్టూరి వీరయ్య రూ 34–10 లకు అమ్మవలసిన అమ్మోనియంసాస్ఫేటు బస్తా రూ 45–00 లకు అమ్మాడట. (2) వాకా వెంకట సుబ్బమ్మ 2 కిలోల బియ్యం రూ 1–62 లకు అమ్మవలసివుండగా రూ 1–85 లకు అమ్మిందట. (3) యాదాల వెంకట సుబ్బయ్య గొల్లభామమార్కు పాంచ్‌జోళ్లు రెండు రూ 4–62 లకుబదులు రూ 4–63కు అమ్మాడట. (4)వువ్వాడి వెంకటసుబ్బమ్మ 2 కిలోల బియ్యం రూ 1–62 లకుమారుగా

—కొరవ 7 వ పేజీలో

# ప్రజాస్వామ పద్ధతిలో ఇరువురినీ బలాబలాలు తేల్చుకోనివ్వడం వుత్తమం!

## కాని చిత్రమైన కాంగ్రెస్ సంస్థలో ఇది సాధ్యమా?

రాష్ట్రంలో రాజకీయ పరిస్థితి చిత్రంగా ఉంది. ఫలానివిధంగా ఉందీఅని వర్ణించలేని స్థితియిది. ఆర్థిక, సాంఘిక, విద్యా విషయాది రంగాల్లోవలెనే రాజకీయాల్లో కూడా నేటిస్థితికి ప్రధానబాధ్యత, కారణం కూడా కాంగ్రెసేనని వేరే చెప్పనక్కరలేదు.

మానవులలో ఏసంఘటనలోనైనా అభిప్రాయ భేదాలు ఏర్పడ్తాయి. సాధారణ మానవులన్నవారికి విభేదాలను అధిగమించేటందుకు, తగాయిదాలను తీర్చుకునేటందుకు మార్గాలు పద్ధతులుకూడా కనపడకపోవు, తోచకపోవు. కాని కాంగ్రెస్ మానవులు ఒక ప్రత్యేక తరగతికి చెందినవారైవుండాలి. లేకపోతే ప్రతి చిన్నవిషయం కొండంత, మేరుపర్వతమంత కానవసరముండదు.

ప్రదేశ్ ఎన్నికల సంఘంలో అసలు కాళీఅంటూ ఉన్నదాఅనేది మొదటి తగాయిదా. ఉంటే దాన్నిఎలాభర్తీ చేయాలన్న విషయమై తగాయిదా; రాజీమార్గాన, లేక ఎన్నికమార్గాన అనేది ఇంతవరకు తెగని వివాదం; పోటీజరిగితే వోటర్లు ఎవరు, ఎన్నిక ఎవరిఆధ్వర్యాన, మరెవరి పర్యవేక్షణక్రింద జరగాలి; రాజీఐతే, ఎవరు, ఏవిధంగా జరిపించాలి–ఇలా ఒకటి తరువాత మరొకటి ప్రశ్న ఉదయిస్తూనే ఉన్నది.

**మా హైదరాబాదు విలేఖరి**

ఈప్రశ్నలు ఎందుకు, ఏఉద్దేశంతో, ఏ సంకల్పంతో, ఏలక్ష్యంకోసం ఉదయింప చేయబడుతున్నాయో, మనలాంటి సాధారణ మానవమాత్రులకు అతీతమైన రహస్యంకాని, మాయమర్మంకానీ కాదు.

ఏమైనాసరే పోటీ జరిగితీరాల్సిందే, లేదా నేనుచెప్పిన అభ్యర్థిని ఒప్పుకోవాలని ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి బల్లగుద్ది పదేపదే చెబుతున్నారు. అలాఅని నిశ్చింతగావున్నారాఅనేందేదు. కాంగ్రెస్ అధ్యక్షుడు కామరాజ్, రాజకీయకారణాలపై నిర్ణయాలుతీసుకొని తమపై రాజీ అభ్యర్థిని రుద్దుతారేమోనన్నభయంకూడా వారిలో లేకపోలేదు. రాజీయేఅవుతే తమకు వీలయినంత అనుకూలంగావుండే అభ్యర్థిని ఎలా ఎన్నికలసంఘంలోకి తెచ్చుకోవాలా అని వారు తంటాలుపడుతున్నారు.

అలాగే సమైక్యవర్గంవారు రాజీ రాజీ అని ఎలుగెత్తిచాటుతున్నారు. కాని బ్రహ్మానందరెడ్డిని నేరుగా కలుసుకొని రాజీయో, పోటీయో తేల్చుకునేటందుకు సిద్ధపడరు. కాంగ్రెస్అధ్యక్షుడు రాజీచేయాలట. ఎవరి పేరాయనచెప్పినా అంగీకరిస్తామంటారు. ఎవరిపేరైనా ఎందుకుచెప్పరో, ఇంతవరకు యెందుకుచెప్పలేదో తెలియదు. అసలు అటు సంజీవరెడ్డిగారికి, ఇటు బ్రహ్మానందరెడ్డిగారికి కామరాజ్‌గారేంచెప్పారో మనకింతవరకు ఆయన ముఖతా తెలియలేదు. పోని రాజీఐని సమైక్యవారు వూరుకోవడంలేదు. పోటీకి సర్వం సిద్ధంచేసుకుంటున్నారు.

పోటీజరిగితే తమఅభ్యర్థికి 40 వోట్ల

—కొరవ 7 వ పేజీలో

పూర్ణా బిస్కెట్ ఫ్యాక్టరీ - నెల్లూరు

## బహుమానములు

విక్రయమునకుగాను మార్కెట్టులో రిలీజు చేయనున్న బిస్కెట్లకు (ప్యాకెట్లకుగాను) ఆకర్షణీయమైన కొన్ని పేర్లు కోరబడుచున్నవి.

(1) పేర్లను ఇంగ్లీషు – తెలుగు – హిందీ భాషలలోని పదములలో తెలుపవలయును.

(2) తెల్లనికాగితముపై ఒక ప్రక్కన విడిఅక్షరములతో వ్రాయవలయును.

(3) మీరు పంపేపేర్లు అంగీకరించబడి, రిజిస్ట్రేషన్‌కు అభ్యంతరముకాని పక్షమున, ఈ దిగువ తెలపినరీతిన బహుమానము యొసంగబడును.

(4) ఒక్కొక్క పేరునకు రూ. 116/- లు నగదు బహూకరించబడును.

(5) మాకు యిష్టము కాని పేర్లను మీరు వాపసు కోరే యెడల మీ ఖర్చులతో వాపసు చేయబడును.

(6) పేర్లను సెలెక్టు చేయుటలోగాని – తొలగించుటలోగాని జరుగబడే నిర్ణయమునకు కంపెనీ జవాబుదారీని ప్రశ్నించే హక్కు లేదు. వాటిని గురించి, ఉత్తర ప్రత్యుత్తరములు జరుపబడవు.

(7) పై షరతులకు ఇష్టపడినవారు ఈ సదవకాశమును వినియోగించుకొని సాధ్యమైనంత త్వరలో పేర్లను తెలుపగలరని ఆశించుచున్నాము.

(8) ఈ దిగువ అడ్రస్సునకు నేరులోగాని, పోస్టులోగాని తెలుపవచ్చును.

అడ్రస్సు :-
Phone : 294.
Subedarpet,
NELLORE

ఇట్లు, మీ అభిమానపాత్రమైన
పూర్ణా బిస్కెట్ ఫ్యాక్టరీ.
సుబేదారుపేట – నెల్లూరు

